సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 10 । మార్చి । 2023



ఆర్పీఎఫ్ బ్యారక్ ప్రారంభం

విశాఖ: డీజిల్ లోకో షెడ్ వద్ద ఆధునికీకరించిన రైల్వే భద్రతా దళం బ్యారక్‌ను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు.



పోలింగ్ బూత్‌ల పరిశీలన

విశాఖ: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఏయూలోని పోలింగ్ బూత్‌లను సీపీ శ్రీకాంత్ సందర్శించారు. బందోబస్తు సూచనలు చేశారు.



వేద విద్యా సమ్మేళనం

విశాఖ: ఈ నెల 11, 12 తేదీల్లో వేద విద్యా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర వేద విద్యా ట్రస్ట్ కార్యదర్శి భాస్కరరావు చెప్పారు.

న్యూస్‌రీల్

పక్కాగా రీసర్వే: జేసీ ఆదేశం



మహిళకు రీసర్వే గురించి వివరిస్తున్న జేసీ కల్పనాకుమారి

అనకాపల్లి టౌన్: జిల్లాలో భూ రీసర్వే పక్కాగా జరగాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి ఆదేశించారు. చోడవరం మండలం దాములనాపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రీ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వలన కలిగే లాభాలను ప్రజలకు ఆమె వివరించారు. రీ సర్వే గురించి అధికారులు రైతులకు, గ్రామస్తులకు వివరిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా రెవెన్యూ సిబ్బంది కచ్చితంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. చోడవరం తహసీల్దార్ తిరుమలబాబు, మండల సర్వేయర్, సర్పంచ్ పాల్గొన్నారు.

చిన్నారిని గాయపరిచిన కుక్క



రిషిత ముఖంపై గాయం

కె.కోటపాడు: చౌడువాడకు చెందిన రెండేళ్ల చిన్నారి కొమార రిషితను వీధి కుక్క గాయపరిచింది. ఇంటి వద్ద బుధ వారం రాత్రి ఎవ రూ లేని సమయంలో అటు వైపుగా వెళ్తున్న కుక్క రిషితపై దాడి చేసింది. సమీపంలోని నివాసాల వారు వచ్చి కుక్కను తరిమివేయడంతో చిన్నారిని విడిచిపెట్టింది. తండ్రి లక్ష్మణరావు రాత్రి ఇంటికి వచ్చిన తరువాత మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి రిషితను తీసుకువెళ్లారు. బాలిక తల్లి గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

12, 13 తేదీల్లో సాధారణ సెలవు

విశాఖ విద్య: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12,13 తేదీల్లో జిల్లాలో పోలింగ్ జరిగే ఇనిస్టిట్యూషన్స్/కార్యాలయాలకు సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

14 నుంచి నులిపురుగుల నివారణ

అనకాపల్లిటౌన్ : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఈ నెల 14 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ, మహిళాభివృద్ధి శాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొనాలని కోరారు. నిర్ణీత వయసున్న పిల్లలందరూ మాత్రలు వేసుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.

సిరుల 'పట్టు'

జిల్లాలో పట్టు పరిశ్రమ ఆదరణ పెంచుకుంటోంది. కరోనా సమయంలో కాస్త మందగించిన సాగు గత ఏడాదిగా పుంజుకుంటోంది. తక్కువ పెట్టుబడి.. ఏడాదిలో ఐదారుసార్లు దిగుబడి.. అధికారుల సూచనల మేరకు సాగు చేస్తే రెట్టింపు ఆదాయం. ఒకసారి మల్బరీ తోట వేస్తే 15–20 ఏళ్లపాటు వెనక్కి చూడాల్సిన పనిలేదు. ఇవే జిల్లాలో పట్టు పరిశ్రమ వేపు చిన్న, సన్నకారు రైతులు ఆసక్తి చూపేందుకు కారణమవుతోంది.

- ఉష్ణోగ్రతల్ని అధిగమిస్తే అధికాదాయమే
- ఏడాదికి రూ.1.20 లక్షల వరకు ఆదాయం
- గరిష్టంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రత దాటరాదు
- ఉష్ణతాపం జాగ్రత్తలపై రైతులకు శిక్షణ



పట్టు పురుగుల పెంపకం

సాక్షి, అనకాపల్లి : పట్టు రైతుల ఆశలు ఫలిస్తున్నాయి. మార్కెట్‌లో మంచి ధర పలకడంతో సాగు లాభదాయకమవుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంటు కింద షెడ్ల నిర్మాణాలకూ ప్రభుత్వం రాయితీలిస్తోంది. దీంతో తక్కువ పెట్టుబడితో అధిక రాబడి పొందుతున్నారు.

వేసవి గడ్డు కాలం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించే పట్టు రైతులకు వేసవి నాలుగు నెలలూ గడ్డుకాలంగానే చెప్పుకోవచ్చు. పట్టు పరిశ్రమలో పట్టుపురుగు ఆరోగ్యంగా, బలంగా ఉంటేనే ఈ గూళ్ల నుంచి సిల్క్ ఎక్కువగా వస్తుంది. ఆదాయం బాగుంటుంది. అయితే ఈ పురుగులు అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేవు. గరిష్టంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే ఉండాలి. వేసవిలో జిల్లాలో ఎండ తీవ్రత 45 డిగ్రీల వరకు ఉండే అవకాశాలుంటాయి. ఈ ఉష్ణతాపం నుంచి పట్టు పురుగును సంరక్షించుకోగలిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చు.

అందుబాటులో ఉన్నవాటితోనే..

ఉష్ణోగ్రతల నిర్వహణపై ఇప్పటికే సెరికల్చర్ ఉద్యోగులు రైతులకు శిక్షణ అందిస్తున్నారు. అందుబాటులో ఉన్న వస్తువులతోనే పురుగుల్ని పెంచుతున్న షెడ్లో ఉష్ణోగ్రతలను నియంత్రించుకోవాలి. ఎండు గడ్డి, చొప్పగడ్డి, వెదురు తడికెల్ని షెడ్లపై వేసి తేమ ఆరకుండా ఎప్పటికప్పుడు నీటి తడి చేయాలి. కిటికీలకు గోనె సంచులు కట్టి వాటిని కూడా నీటితో తడుపుతూ ఉండాలి. ఇలాంటి చిన్నపాటి ముందు జాగ్రత్తలు పాటిస్తే.. పట్టు పరిశ్రమ బంగారమయం అవుతుంది.

ప్రభుత్వ రుణం, రాయితీ

- ఎకరా విస్తీర్ణంలో మల్బరీసాగుకు రూ.25 వేలు, ఇందులో రూ.18,750 రాయితీ.
- టైప్–1 షెడ్ కోసం రూ.4 లక్షలు(సబ్సిడీ రూ.3 లక్షలు), పట్టు పురుగుల పెంపకానికి రూ.75 వేలు(సబ్సిడీ రూ.56,250)
- టైప్–2 షెడ్డు కోసం రూ.3 లక్షలు(సబ్సిడీ రూ.2.25 లక్షలు), పట్టు పురుగుల పెంపకానికి రూ.50 వేలు(సబ్సిడీ రూ.37,500)
- చాకి సెంటర్ల ద్వారా పురుగుల సరఫరాకు 100 గుడ్లకు రూ.వెయ్యి రాయితీ
- వ్యాధి నిరోధక మందులు రూ.5 వేలుకు గానూ రూ.3,750 సబ్సిడీ ఇస్తుంది.



పట్టు పురుగుల పెంపకంలో రామచంద్రపురం మహిళా రైతు

రైతులకు అవగాహన

జిల్లాలో సెరికల్చర్ అధికారులు పట్టు రైతులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. పట్టు పురుగుల పెంపకంలో ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటే అంతా బాగానే ఉంటుందని అధికారులు చెప్తున్నారు. పురుగులు కుబుసం విడిచినప్పుడు, రోగ నిరోధక శక్తిని పెంచేందుకు ఫార్మనిక్ పౌడర్, విసర్జకాల నుంచి వైరస్ రాకుండా పొడి వాతావరణం కోసం కాల్చిన సున్నం చల్లాలి. పట్టు పురుగులను ప్రతి పూటా నిశితంగా పరిశీలించటం, షెడ్‌ను రసాయనాలతో కడగటం ద్వారా 90 శాతం నష్టాలను నివారించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

రూ.1.20 లక్షల ఆదాయం

అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పరిశ్రమకు ఆదరణ పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితో రైతులు అధిక లాభార్జించేలా పట్టు పెంపకం జరుగుతోంది. కరోనా కారణంగా కాసింత మందగించిన పట్టు పరిశ్రమ గతేడాది నుంచి పెరుగుతోంది. రెండు ఎకరాల మల్బరీ తోటలో ప్రతి పంటకు 200 పట్టుగుడ్ల వరకు పెంచుతున్నారు. ఏడాదికి ఐదారుసార్లు దిగుబడి ఉంటుంది. నిర్వహణ వ్యయం పోగా ఆదాయం కూడా రూ.లక్షా 20 వేల వరకు వస్తున్నట్టు రైతులు చెప్తున్నారు. రెండెకరాలున్న రైతులు వాటిని రెండు భాగాలుగా చేసి ప్రతి నెలా సాగు చేస్తే ఆదాయం రెండింతలు వస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

126 మంది రైతులు.. 284 ఎకరాలు

ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పరిధిలోని 15 మండలాల్లో 126 మంది రైతులు 284 ఎకరాల్లో పట్టు పరిశ్రమ చేపట్టి జీవనోపాధి పొందుతున్నారు. దీని ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడంతోపాటు, పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఒకసారి మల్బరీ తోట నాటితే 15–20 ఏళ్ల వరకు ఏటా సగటున కనీసం ఐదుసార్లు దిగుబడి పొందొచ్చు. చిన్న, సన్నకారు రైతులకు పట్టుపరిశ్రమ అనుకూలంగా ఉంటుంది. ఇందులో మహిళల్ని ఎక్కువగా భాగస్వాములుగా చేయొచ్చు.

వేసవిలో రైతులకు అవగాహన



ఈ ఏడాది మల్బరీ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ పెంచింది. గతంలో రూ.14 వేల వరకు ఉండేది. ఇప్పుడు రూ.25 వేలకు పెంచింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు అయితే 90 శాతం రాయితీ ఉంటుంది. వేసవిలో రైతులు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం. కొత్త రైతులు కూడా మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వర్షాకాలంలో పట్టు పురుగుల పెంపకం ద్వారా మంచి లాభాలు అందుకోవచ్చు. గతంలో కంటే ఇన్‌సెంటివ్స్ కూడా పెరిగాయి. తెల్లగూడు కేజీకి రూ.50, పసుపు గూడుకి అయితే కేజీకి రూ.20 అందిస్తున్నాం.

– చంద్రజీవన్, సెరీకల్చర్ జిల్లా అధికారి

నేడు ఆన్‌లైన్‌లో వన్డే టికెట్ల విక్రయం

- 14న ఆఫ్‌లైన్‌లో మూడు ప్రాంతాల్లో..



విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో భారత్–ఆస్ట్రేలియాల మధ్య ఈనెల 19న జరగనున్న డేనైట్ వన్డే మ్యాచ్ టికెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆన్‌లైన్‌లో విక్రయించనున్నారు. అభిమానులు పేటీఎమ్ paytm app/ paytm insider app/ insider. in website ద్వారా టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి తెలిపారు. కనీస ధర రూ.600లు కాగా రూ.1500, రూ.2000, రూ.3000, రూ.3500, రూ.6 వేల వరకు ఆరు డినామినేషన్లలో టికెట్లు ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను ఈనెల 14న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైఎస్సార్ స్టేడియం బి గ్రౌండ్, మున్సిపల్ స్టేడియం, రాజీవ్‌గాంధీ క్రీడాప్రాంగణంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న టికెట్లను 19న వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఫిజికల్ టికెట్లుగా మార్చుకోవచ్చన్నారు. మ్యాచ్‌ను 27 వేల మంది స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. వెస్టిండీస్ జట్టు భారత్‌తో ఇక్కడ 2019లో తలపడగా మూడున్నరేళ్ల తరువాత వన్డే మ్యాచ్ జరగనుంది.

14న వాహనాల వేలం

అనకాపల్లి టౌన్ : పట్టణంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జె.రవికుమార్ పర్యవేక్షణలో ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ అనురాధ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు అదే రోజు రూ.3 వేలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు పాడుకోని వారికి ధరావతును తిరిగి చెల్లించేస్తామన్నారు.

సుధాకర్ గెలుపు ప్రగతికి పిలుపు

మంత్రి అమర్‌నాథ్ విస్తృత ప్రచారం



కశింకోటలో మంత్రి అమర్‌నాథ్ ఇంటింటి ప్రచారం

కశింకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. కశింకోటలోని కస్పావీధి, గవరపేట, రెల్లి వీధుల్లో గురువారం సాయంత్రం పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ పలక యశోద రవి, మాజీ చైర్మన్ మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఐకి సదరన్ నేవల్ కమాండ్ నిర్వహణ కాంట్రాక్టు

రూ.64 కోట్లతో కొచ్చి నేవల్ చానల్ డ్రెడ్జింగ్ పనులు

సాక్షి, విశాఖపట్నం : వరుస కాంట్రాక్టులతో దూసుకుపోతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐ) మరో భారీ పనులను దక్కించుకుంది. కొచ్చికి చెందిన సదరన్ నేవల్ కమాండ్(ఎస్ఎన్‌సీ) నిర్వహణ బాధ్యతల కాంట్రాక్టును డీసీఐ సొంతం చేసుకున్నట్లు డీసీఐ ఎండీ కెప్టెన్ దివాకర్ వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన ఎస్ఎన్‌సీ నేవల్ చానల్ నిర్వహణ పనులను రూ.64 కోట్లతో ఎర్నాకులంలోని డీసీఐ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ చానల్‌లో మొత్తం ఏడాది కాలంలో 1.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకూ డ్రెడ్జ్ చేయనున్నట్లు ఎండీ తెలిపారు.

శరవేగంగా ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు



బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి గురువారం పరిశీలించారు. వెబ్‌కాస్టింగ్, పేపర్ భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లతోపాటు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే ఏఎంఏఎల్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటింగ్‌ను ఉదయం ఎన్ని గంటలకు ప్రారంభించాలి, ఎన్ని గంటల్లోపు పూర్తి చేయాలి, వాహనాల ఏర్పాటు, బందోబస్తు మొదలైన వాటిపై సలహాలు సూచనలు అందించారు. అంతకు ముందు జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి నోడల్ అధికారులతో వెబెక్స్ ద్వారా సమావేశమై వారికి సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.

జోరుగా పోలింగ్ ఏర్పాట్లు

- పర్యవేక్షిస్తున్న ఆర్వో మల్లికార్జున
- ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల పంపిణీ పూర్తి
- వెయ్యి ఓట్లు దాటితే మూడో బ్యాలెట్ బాక్స్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పోలింగ్ సామగ్రి పంపిణీ, తదితర అంశాలపై సమీక్షిస్తున్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో బ్యాలెట్ పేపర్ల పంపిణీ ప్రక్రియ గురువారం ఉదయానికి సజావుగా పూర్తయింది. పోలింగ్ స్టేషన్లకు అవసరమైన సామగ్రిని తరలించే ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఈ నెల 13న పోలింగ్ జరగనుండడంతో 11న సాయంత్రం 4 గంటలకు ప్రచారాన్ని ముగించాలని ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులందరికీ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్నికల విధులకు వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందిని వినియోగించుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే ఎన్నికల విధులను ఉద్యోగులు, అధికారులకు అప్పగించామని.. అవసరమైతే సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవచ్చని బీఎల్‌వోలకు సూచించారు.

మరోవైపు 56 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1000కి పైగా ఓట్లున్నాయి. నిబంధనల మేరకు ఒక బ్యాలెట్ బాక్సులో గరిష్టంగా 500 ఓట్లు మాత్రమే ఉంచాలి. 500 ఓట్లు దాటిన ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండు చొప్పున బ్యాలెట్ బాక్సులు అందిస్తున్నారు. 1,000 మందికి పైగా ఓటర్లున్న పోలింగ్ బూత్‌లలో మూడు బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నారు. ఒక బ్యాలెట్ బాక్స్ నిండిన వెంటనే పోలింగ్ ఏజెంట్లు, అధికారులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో దానికి సీల్ వేయనున్నారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో మొత్తం 193 పోస్టల్ బ్యాలెట్స్‌కు దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మల్లికార్జున పాల్గొన్నారు.



కిల్కారీ పోర్టల్

కిల్కారీ.. ఎంతో ఉపకారి

- మొబైల్ ద్వారా గర్భిణులు, బాలింతలకు సూచనలు
- మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యం
- కిల్కారీ పోర్టల్ ద్వారా తెలుగు సహా ఐదు భాషల్లో వాయిస్ మెసేజ్‌లు

అనకాపల్లి రూరల్: మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. గర్భిణులు, బాలింతల్లో అవగాహనతోనే సత్ఫలితాలు సాధించగలమన్న నమ్మకంతో వినూత్న రీతుల్లో అందుకు యత్నిస్తున్నారు. మరణాలకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే గర్భిణులుగా నమోదైన దగ్గర్నుంచి ప్రసవం అయ్యే వరకు వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తూ వారికి అవసరమైన సేవలు అందించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. అందులో భాగంగా గర్భంతో ఉన్న మహిళ సరైన సమయానికి అవసరమైన జాగ్రత్తలు, మందులు తీసుకునేలా అలెర్ట్‌తో కూడిన ఫోన్ కాల్స్ చేస్తారు. కిల్కారీ పోర్టల్ ద్వారా దేశంలోని ఐదు భాషల్లో ఈ వాయిస్ మెసేజ్‌లు వస్తాయి. కొద్ది కాలంగా తెలుగులో కూడా సూచనలు అందించడంతో పలువురు గర్భిణులు, బాలింతలు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వారానికి ఒక ఆడియో సందేశం

అన్నయ్యా, వదినమ్మా నమస్కారం.. బాగున్నారా? కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిల్కారీ మొబైల్ సేవ నుంచి వైద్యుడిని మాట్లాడుతున్నా.. మీరు ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఆరోగ్యం ఎలా ఉంది.. పాపాయి బాగుందా? బిడ్డ ఆరోగ్య సంరక్షణకు మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలను చెబుతా వినండి.. మన మంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్తు అందిద్దాం అంటూ.. గర్భిణులకు నాలుగో నెల నుంచి వారానికొక ఆడియో చొప్పున బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 వారాలపాటు సమాచారం ఇస్తారు.

జిల్లాలో..		
గర్భిణులు	:	22,822
బాలింతలు	:	21,768



తగరంపూడి పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న ఏఎన్ఎం

బిడ్డ పుట్టిన తర్వాత..

మీకు తెలుసా? పుట్టిన గంటలోగానే బిడ్డకు పాలు తాగించాలి. తల్లి పాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం.. బిడ్డకు కావాల్సినవన్నీ ఈ పాలలో ఉంటాయి.. ఇలా కిల్కారీలో నమోదైన ప్రతి గర్భిణి/బాలింత మొబైల్ ఫోన్‌కు 01133278000 అనే నంబరు నుంచి ఆడియో మెసేజ్‌లు వస్తాయి. మొదటిసారి కాల్ లిఫ్ట్ చేయకపోతే మరో రెండు సార్లు కాల్స్ వస్తాయి. ఆండ్రాయిడ్ ఫోన్‌తో పాటు కీప్యాడ్ ఫోన్ ఉన్నా ఈ సేవలు పొందవచ్చు.

ఎంతో ప్రయోజనం

గర్భిణికి సుఖ ప్రసవంతోపాటు బిడ్డకు జన్మనిచ్చాక కూడా ఆ శిశువు ఆరోగ్యంగా ఎదిగేందుకు ఈ కిల్కారీ కాల్స్ తోడ్పడుతున్నాయి. పిల్లలు విరేచనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వయస్సుకు తగిన బరువు ఉండేందుకు ఏంచేయాలి? పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం ఏమిటి వంటి సూచనలు, సలహాలు ఇందులో ఉంటాయి. ఈ విధానాన్ని 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినా ఇటీవలే బాగా ప్రాచుర్యం కల్పించారు.

సిబ్బందికి శిక్షణ

కొత్తగా అమలు చేస్తున్న కిల్కారీ సేవలపై జిల్లావ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ఉన్న సిబ్బందికి, క్షేత్రస్థాయిలో సేవలందించే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

మారుమూల ప్రాంతాల్లో సైతం..



కిల్కారీ పోర్టల్ వల్ల మారుమూల ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు సైతం అవగాహన పెరుగుతుంది. బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు సేవలు అందుతాయి. ఈ సూచనలు పాటించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మాతా శిశు మరణాలను చాలా వరకు తగ్గించవచ్చు.

– ఎ.హేమంత్, డీఎంహెచ్‌వో, అనకాపల్లి

నాలుగో నెల నుంచి సూచనలు



గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మూడు నెలలు పూర్తయ్యాక సమయానికి నిద్ర అవసరమని, నిద్ర పోయేటపుడు ఎడమవైపునకు ఉంటే బిడ్డకు, తల్లికి మంచిదని తెలిసింది. నాలుగో నెలలో పెరగాల్సిన బరువు, రక్త ప్రసరణ సక్రమంగా ఉండేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తెలిశాయి. ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కోసం శ్వాస వ్యాయామాలు చేయడం మంచిదని సూచించారు.

– అగదాల చిన్ని, గర్భిణి, చెక్కానగర్, పాయకరావుపేట

రోజుకు 3 లీటర్ల నీరు తాగాలని చెప్పారు



ప్రసవం తర్వాత నెలనెలా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిశాయి. మొదటి నెలలో బిడ్డకు తల్లి పాల ప్రాముఖ్యత, రెండో నెలలో వాతావరణ మార్పుల కారణంగా ఆస్మా వంటి వ్యాధుల బారిన పడితే ఏం చేయాలి? మూడో నెలలో బిడ్డకు వేయించాల్సిన టీకాలు.. మొదలైన వివరాలు తెలుగులో అర్థమయ్యేలా సందేశాలు వచ్చాయి. ప్రసవం తర్వాత తీసుకోవాల్సిన పోషకాహారం గురించి వివరించారు. రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు, కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం లాంటివి తీసుకోవడం మంచిదని తెలుసుకున్నాను.

–సీరా రమ్య, వెంకటాపురం, రాంబిల్లి మండలం

జాతీయ అథ్లెటిక్స్‌లో వేచలం విద్యార్థికి రజతం



విద్యార్థి గణేష్, పీడీలను అభినందిస్తున్న హెచ్‌ఎం, గ్రామ పెద్దలు

దేవరాపల్లి: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ మీట్‌లో మండలంలోని వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దమ్ము గణేష్ రజత పతకం సాధించాడు. బీహార్ రాజధాని పాట్నాలో గత నెలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో అండర్–14 బాలుర విభాగంలో ట్రయథ్లాన్ గ్రూప్–బి ఈవెంట్ (60 మీటర్ల రన్నింగ్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, హైజంప్)లో గణేష్ విశేష ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయిలో రజత పతకం సాధించిన గణేష్‌తో పాటు పీడీ తమ్మునాయుడును హెచ్‌ఎం దేవులపల్లి నర్సింహమూర్తి, సర్పంచ్ నాగిరెడ్డి శతారినాయుడు, ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి, హైస్కూల్, ఎంపీపీ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్లు రెడ్డి శ్రీనివాస్, వేచలపు పరమేష్ అభినందించారు. అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న గణేష్‌కు వేచలం గ్రామ పెద్దలు, యువకులతోపాటు సిరి ఫౌండేషన్, మామిడిపల్లికి చెందిన సర్కార్ హెల్పింగ్ హ్యాండ్స్ తదితర్లు ప్రోత్సాహం అందిస్తున్నారు. వీరికి పాఠశాల తరపున హెచ్‌ఎం, పీడీ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా సాధికారతకు సీఎం కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ ఆవరణంలో గురువారం వేడుకలు నిర్వహించారు. మహిళా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా అధికారులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో రాణిస్తున్న మహిళా ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను సత్కరించారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కాని 50శాతం మహిళా రిజర్వేషన్లు అన్ని రంగాల్లోనూ అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాలు అందజేసి స్వయం ఉపాధితో ఆర్థికంగా మహిళలు ఎదగడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వినియోగించుకుని మహిళలు మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. బాలికల చదువుకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైద్యాధికారి దమయంతి, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైస్ ఎంపీపీ బైన కుమారి, పంచాయతీ విస్తరణాధికారి చైతన్య, సూపరింటెండెంట్ అమ్మాజి, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

నెల రోజులపాటు నూకాంబిక జాతర

అమ్మవారిని దర్శించుకున్న దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్



అమ్మవారిని దర్శించుకుంటున్న సుజాత, పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నె 20 నుంచి ఏప్రిల్ 19వ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత తెలిపారు. ఇక్కడ ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయ పరిసరాల్లో రోజూ చెత్త తరలించే ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ జెడ్సీ పి.వెంకటరమణను ఆదేశించారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని, ఆలయం వైపు రహదారులతోపాటు ముఖ్య కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. జాతరలో భాగంగా అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఆలయ ఆవరణలో నిత్యం అగ్నిమాపక వాహనం ఉండాలని ఆశాఖ అధికారులకు సూచించారు. నెల రోజులపాటు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసుల పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆలయ పరిసరాల్లో మాదక ద్రవ్యాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్, డీఎస్పీ మళ్ల మహేష్, ఆలయ ఈవో చంద్రశేఖర్, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, ఏఈ సుమిత్ర, ఎన్టీఆర్ వైద్యాలయ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీను పాల్గొన్నారు.

దేశ పురోగతికి యువత ఉత్ప్రేరకం కావాలి

- పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు



మాట్లాడుతున్న పూర్వ వీసీ ముత్యాలనాయుడు

కశింకోట : ప్రజాస్వామ్య నైతికతకు యువత మద్దతుగా నిలవాలని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సాయంత్రం 'నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు' అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. స్వచ్ఛ భారతదేశం కోసం నాయకులను నిర్మించడంలోను, ఆత్మ నిర్భర్‌గా మార్చడంలోను విద్యార్థులు ఉత్ప్రేరకంగా పని చేయాలన్నారు. యువతలో ఉత్సాహం దేశాన్ని ఆర్థికంగా సాధికారత కలిగిన దేశంగా మారుస్తాయన్నారు. సమాచారం, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచడానికి నెహ్రూ యువ కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఆకలి నిర్మూలన, లింగ సమానత్వం, తక్కువ వ్యయంతో పరిశుభ్రమైన ఇంధనం, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం మెరుగుపరచడం వంటి అంశాలపై విద్యార్థులు దృష్టి నిలపాలన్నారు. అటవీ శాఖ విశాఖ రేంజ్ అధికారి బిర్లంగి రామనరేష్, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు ఎస్.వి.ఆర్ నాయుడు, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి. మహేశ్వరరావు, ఎన్‌వైకె రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత లీలాప్రసాద్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షఫీ మహమ్మద్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి–యలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య గురువారం రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడు దుర్మరణం చెందాడు. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాల ప్రకారం..అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల పట్టాలు దాటుతున్న ఏనుగుతునికి చెందిన నెల్లూరు సోమినాయుడు(70) మృతి చెందాడు. రైలును గుర్తించకపోవడం వల్ల ప్రమాదం జరిగింది. మృతునికి ముగ్గురు కుమార్తెలున్నారు. కుమారుడు, భార్య ఇప్పటికే మృతి చెందారు. దీంతో తన కోడలు వద్ద ఉంటున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల కోసం భద్రపరిచి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన కొటాన అప్పలనాయుడు



తీవ్ర గాయాలతో కె.కోటపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దారపురెడ్డి నాయుడు

దేవరాపల్లి: మండలంలోని సంజీవమెట్ట వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు సంజీవపురం గ్రామానికి చెందిన కొటాన అప్పలనాయుడు (54) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన దారపురెడ్డి నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి 10.40 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. సంజీవపురం నుంచి కాశీపురం వైపు వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అటు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. వెంటనే అతను పరారయ్యాడు. ఈ ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిద్దరిని కె.కోటపాడు సీహెచ్‌సీ తరలించారు. అప్పలనాయుడు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు, తీవ్రంగా గాయపడిన దారపురెడ్డి నాయుడుకు వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతుడు అప్పలనాయుడికి భార్య లక్ష్మి, వివాహితురాలైన కుమార్తె ఝాన్సీ, బీటెక్ చదువుతున్న కుమారుడు సురేష్ ఉన్నారు. గాజువాక సమీపంలోని నాతయ్యపాలెంలో కళాసీగా పనిచేస్తున్న నాయుడు తన తమ్ముడిని చూసేందుకు వచ్చి గాయపడ్డాడు. ఈ ఘటనతో సంజీవపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

మాకవరపాలెం: బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. మండలంలోని రాచపల్లికి చెందిన ఇటంశెట్టి జోగుతల్లి(70) బుధవారం అర్ధరాత్రి స్థానిక కామేశ్వరమ్మ ఆలయం వద్ద వివాహానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గా యపడిన ఆమెను నర్సీపట్నం తరలించారు. అక్కడ్నుంచి విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది.

24 నుంచి డిగ్రీ పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

- డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. అదే విధంగా రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా వచ్చేనెల 6 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలు, ఇతర వివరాలు ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

మోదమ్మ సేవలో బుల్లితెర నటి సౌమ్య



బుల్లితెర నటి సౌమ్యకు అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల: బుల్లితెర నటి సౌమ్య గురువారం స్థానిక మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ తాను ఇంతవరకు కన్నడ, తమిళ భాషల్లోని పది సీరియల్స్‌లో నటించానన్నారు. ప్రస్తుతం సహ హీరోయిన్‌గా నటించిన శ్రీమంతుడు సీరియల్ తనకు మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. తెలుగు సినిమాలో మంచి పాత్ర వస్తే నటిస్తానని తెలిపారు. జర్నలిజంలో రెండు డిగ్రీలు పూర్తి చేశానన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెరిగిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.10 పెరిగింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం రూ.30కి చేరింది. మిగిలిన కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. ఉల్లి, బంగాళాదుంప, క్యాబేజీ రూ.20, బీట్‌రూట్, క్యారెట్, వంకాయ, పచ్చిబఠానీ కాయలు రూ.40, దొండకాయ, బెండకాయ, కాకరకాయ రూ.60, క్యాప్సికం, బీన్స్ పిక్కలు రూ.80కి విక్రయాలు సాగాయి.

సుధాకర్‌ను గెలిపిద్దాం



ఆదారి వెంకట నర్సింగరావు

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్ సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీ అనుబంధ కళాశాలల అధ్యాపక సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల పూర్వపు కార్యదర్శి ఆదారి వెంకట నర్సింగరావు గురువారం పిలుపునిచ్చారు. ఏపీని సంక్షేమంతో పాటు పారిశ్రామికాభివృద్ధి వైపు పరుగులు తీయిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. పట్టభద్రులంతా సుధాకర్‌ను గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

రహదారి భద్రతపై విద్యార్థుల ర్యాలీ



ఏఎస్‌పేటలో రహదారి భద్రతపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కశింకోట : మండలంలోని ఏఎస్ పేట హైస్కూలు విద్యార్థులు గురువారం రహదారి భద్రతపై ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, బైక్‌పై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని నినాదాలు చేశారు. హెచ్‌ఎం వై.వి.రమణ, పీఈటీ నూకరాజు, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ శ్రీను, వీవోఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

కశింకోట : స్థానిక పూసర్లవీధిలో నగదు పందెం పెట్టి పేకాట ఆడుతుండగా ముగ్గుర్ని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. వారి నుంచి రూ.740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నడిచే దారైనా లేదే..!

- రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి
- వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు
- నర్సింగరావుపేట రోడ్డులో స్థానికుల దుస్థితి

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది నిర్లిప్తతో.. 'మామూళ్ల' వైఖరో.. తెలియదుగానీ.. ఆ రోడ్డులో వెళ్లే వాహనదారులకు, జనాలకు మాత్రం నిత్యం నరకమే. భవన నిర్మాణ సామగ్రితో బిల్డర్లు రోడ్డు మొత్తాన్ని వాడుకుంటున్నా.. పట్టించుకున్న నాథుడు లేడు. ఎవరైనా నిర్మాణం కోసం గోతులు తవ్వుతున్నారంటే చాలు.. వాలిపోయే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, ప్రజలకు ఇంత ఇబ్బంది కలుగుతున్నా.. కనీస చర్యలు తీసుకోకపోవడంలో ఔచిత్యమేంటో.. వారికే తెలియాలి.

అనకాపల్లిటౌన్ : పట్టణంలోని నర్సింగరావుపేట రహదారి పూర్తిగా భవన నిర్మాణ సామగ్రితో నిండిపోయింది. ఇసుక, పిక్క నిల్వల్ని రోడ్డుపైనే వేయడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా.. నానా యాతన పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ ఓ కార్పొరేట్ స్కూల్ కూడా ఉంది. ఉదయం, సాయంత్రం విద్యార్థుల రాకపోకల సమయంలో తప్పనిసరిగా ఇక్కడ ట్రాఫిక్ జామేనంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

స్థానికుల గగ్గోలు

నర్సింగరావుపేటలోని ఈ రోడ్డులో సుమారు 350 ఇళ్లున్నాయి. వీరందరికీ ఇదే ప్రధాన రహదారి. అయితే గత కొన్ని రోజులుగా ఇక్కడ ఓ అపార్ట్‌మెంట్, కొన్ని భవనాల నిర్మాణం జరుగుతోంది. అపార్ట్‌మెంట్ బిల్డరైతే తను తెప్పించిన నిర్మాణ సామగ్రిని రోజుల తరబడి రోడ్డుపైనే ఉంచేస్తున్నారు. సిమెంట్ బస్తాల లోడ్‌ను కూడా రోడ్డుపైనే దింపేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇసుక, పిక్కను పోగులుగా వేయడంతో నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కార్పొరేట్ స్కూల్‌కు పిల్లలు ఉదయం వెళ్లే సమయం, సాయంత్రం స్కూల్ విడిచిపెట్టే సమయంలోనైతే ఆటోలు, తల్లిదండ్రుల ద్విచక్ర వాహనాలతో అడుగు తీసి అడుగు వేసేందుకే వీల్లేని పరిస్థితి. ఇదే రోడ్డులో షిర్డిసాయి మందిరం, న్యాయమూర్తి కార్యాలయం కూడా ఉన్నాయి. ఈ నిర్మాణాల వద్దకు రోజూ ఏదో ఒక సమయంలో జీవీఎంసీ జోనల్ సిబ్బంది వచ్చిపోతున్నారని స్థానికులు చెప్తున్నారు. అయినా దీన్ని పట్టించుకోవట్లేదని ఆక్షేపిస్తున్నారు.



రహదారిపై లారీ నుంచి సిమెంట్ బస్తాలు అన్‌లోడ్ చేస్తున్న కూలీలు



స్కూల్ సమయంలో రద్దీగా రహదారి

టౌన్‌ప్లానింగ్ చర్యలేవీ?

జీవీఎంసీ పరిధిలో ఏ నిర్మాణమైనా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతుంది. అధికారికంగా ప్లాన్ తీసుకున్నా.. అనధికారిక నిర్మాణమైనా.. స్థానిక చైన్‌మన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు తెలియకుండా జరిగే అవకాశమే లేదు. నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు ఆరా తీయడం, ప్లాన్ ప్రకారం నిర్మిస్తున్నారా? లేదా? తెలుసుకోవడం, సదరు నిర్మాణం వల్ల చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవడం వీరి పని. అయితే ఈ రోడ్డులో జరుగుతున్న అపార్ట్‌మెంట్ పనుల్లో స్థానికుల ఇబ్బందుల గురించి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పట్టించుకున్న పాపాన పోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. బిల్డర్ వద్ద ముడుపులు తీసుకుని, మిన్నకుండి పోతున్నారని ఆరోపిస్తున్నారు. ఆశీలు పాడుకున్న వారు కూడా చిల్లర వ్యాపారుల వద్ద జులుం ప్రదర్శించడం మినహా, ఇలాంటి వారిపై నోరుకూడా మెదపలేకపోతున్నారు.

జరిమానా వేయొచ్చు!

ఏపీ మున్సిపల్ చట్టం–1965 ప్రకారం భవన నిర్మాణ సమయంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి. నిర్మాణ సామగ్రితో రోడ్లను ఆక్రమించినా, మురుగునీటి కాల్వల ప్రవాహానికి ఆటంకాలు సృష్టించినా జరిమానా విధించొచ్చు. ఇది రూ.వేలు నుంచి రూ.లక్షల్లో కూడా ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వహణ ఇబ్బందులపై తక్షణ జరిమానా వసూలు చేస్తారు. టౌన్‌ప్లానింగ్ సంబంధిత అంశాల్లోనైతే నోటీసులు జారీ చేసి మరీ భారీగా అపరాధ రుసుము విధిస్తారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే బిల్డింగ్ ప్లాన్‌ను రద్దు చేసే అధికారం కూడా అధికారులకు ఉంటుంది. అయితే అనకాపల్లి జోనల్ సిబ్బందికి మాత్రం తమ జేబులు నింపేసుకునే ఏర్పాట్లు తప్ప, చట్ట పరమైన చర్యలు గుర్తుకురావట్లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

మా దృష్టికి రాలేదు



పట్టణంలో కొన్ని రహదారుల్లో ఇళ్ల నిర్మాణం పేరుతో రహదారులను మూసివేస్తున్నారు. జీవీఎంసీ అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు చేపడతాం. నర్సింగరావుపేట రోడ్డు విషయం మా దృష్టికి రాలేదు. ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సిబ్బందిని పంపించి, వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తా.

– పి.వెంకటరమణ, జెడ్సీ, అనకాపల్లి జోన్

ఒత్తిడి వీడితే విజయం తథ్యం



టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ డాక్టర్ లావణ్య

కశింకోట : విద్యార్థులు భయాన్ని వీడి టెన్త్ పరీక్షలకు సిద్ధం కావాలని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యాధికారి కె.లావణ్య కోరారు. మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్లో టెన్త్ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలకు సన్నద్ధం కావడంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. రోజూ యోగా, ప్రాణాయామం ఆచరిస్తూ ప్రశాంత వాతావరణంలో పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా అవసరమైన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

నర్సీపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.సునీత పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జీజీఎం సిన్హా దంపతులు



క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న జీజీఎం సిన్హా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి సుబ్బారావు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలి నగర్ టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంగమం ఆడిటోరియం భవనంలో నిర్వహించిన ఈ వేడుకలను సంస్థ జీజీఎం ఎస్.కె.సిన్హా గురువారం ప్రారంభించారు. 'రోజు వారీ జీవితంలో సుస్థిర భవిష్యత్తు కోసం లింగ సమానత్వం' అనే అంశంపై అమెరికాకు చెందిన బన్సల్ మాట్లాడుతూ లింగ సమానత్వం అవసరమన్నారు. అనంతరం కాంట్రాక్టు మహిళా కార్మికులు, గర్భిణుల ఆరోగ్యం, పొగాకు, మద్యం వినియోగం, భద్రతపై దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా కేక్ కట్ చేసి మహిళలకు తినిపించారు. మహిళా ఉద్యోగులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బేసిక్ ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆరోగ్య శాఖ అధికారి పి.రామారావు మాట్లాడుతూ రక్తస్రావం, విద్యుదాఘాతం, కాలిన గాయాలు, పాము కాటు వంటి వాటికి తక్షణ చికిత్సపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెర్నింగ్ ఏజీఎం కె.వి.ప్రసాద్, హెచ్‌ఆర్ ఏజీఎం రుమాడీ శర్మ, సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పరవాడ: జీఎన్ ఫార్మాసిటీలో ఎంఏఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. మహిళా ఉద్యోగులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఏఎస్‌ఆర్‌ఎం అధ్యక్షుడు వెర్దంతి, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధి శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నిర్వాహకురాలిపై ఆగ్రహం



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : మండలంలోని మాకవరం అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులపై ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆగ్రహించారు. గురువారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు లేకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. టీచర్ వచ్చాక రికార్డులు పరిశీలించగా తేడాలుండటంతో టీచర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచర్‌పై తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను సూచించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మంత్రి సత్యనారాయణ, గోవింద, కరణం సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



కాలువ పూడుకుపోవడంతో రహదారిపై పారుతున్న మురుగునీరు

అనకాపల్లిటౌన్ : స్థానిక నర్సింగరావుపేట షిర్డీసాయి బాబా మందిరం రోడ్డులో మురుగు కాలువలు చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. దీంతో మురుగునీరు రోడ్లపై చేరుకుని, దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు మురుగునీటితో ఇబ్బంది పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్ధులు ఎక్కడ రోగాల బారిన పడతారోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య విభాగం అధికారులు తక్షణమే దృష్టిసారించి, పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్రంథాలయం	రాజా
సీఎస్ఐ	సత్యనారాయణస్క్రీన్-1
సాచి	సత్యనారాయణస్క్రీన్-2
వినరోభాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
వాల్తేరు వీరయ్య	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 4,739 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,730	4,040
మొదటి రకం	3,490	3,720
రెండో రకం	3,200	3,550
మూడో రకం	3,000	3,200

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 339 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 417 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కరుణించమ్మా.. కాపాడమ్మా..

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో ముత్యాలమ్మతల్లి అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి మేళతాళాలతో అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. స్థానిక శాసన సభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు అంతకాపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆయనతో పాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు దంపతులు, సర్పంచ్ సబ్బవరపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీలు చొక్కాకుల గోవింద్, ఝాన్సీ లక్ష్మీరాణి,మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ ఎస్.దేముడు తదితరులు ఉన్నారు.



అంతకాపల్లిలో పూలరథం ఊరేగింపులో భక్తులు

బంగారమ్మపాలెంలో..

బంగారమ్మపాలెంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో బంగారమ్మపాలెం, ద్వితీయ స్థానంలో నాయుడుతోట, తృతీయ స్థానంలో గొందుపాలెం జట్లు నిలిచాయి. ఆ జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను సర్పంచ్ దాడి లావణ్య, ఎంపీటీసీ రాపేటి అరుణ, మాజీ ఎంపీటీసీ దొడ్డి అరుణ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, రాపేటి రా ము, దొడ్డి సూర్యప్రకాష్, కోరుబిల్లి నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ

పరవాడ : మండలంలోని పి.బోనంగిలో దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి గ్రామస్తులు పసుపుకుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు సంజీవరావు, కప్పరాడ శ్రీను, కృష్ణ, గోవిందు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామానికి చెందిన దాసరి శ్రీను ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిపారు. డప్పులు, చిడతలు, తప్పెడుగుళ్లు, నేల డ్యాన్సులు, సాముగరిడిల మధ్య అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం బాణసంచా కాల్చారు.

అమూల్ పాల సరఫరాదారులకు రుణాలు



రుణాల చెక్కును అందజేస్తున్న దృశ్యం

మునగపాక (అనకాపల్లి): అమూల్ పాల కేంద్రానికి పాల సరఫరా చేస్తున్న పాల ఉత్పత్తి దారులకు గురువారం స్థానిక పీఏసీఎస్ ద్వారా రుణాలు అందజేశారు. ఆరుగురు పాల ఉత్పత్తి దారులకు ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కోనపల్లి రామ్మోహన్‌రావు అందజేశారు. సీఈవో ఆదారి వేణుగోపాలరావు, పి.వి మహేశ్వరరావు, అమూల్ సెంటర్ డీఏ బొడ్డేడ నూకరత్నం, టెక్కలి సంతోషి లక్ష్మి పాల్గొన్నారు.

'డీఏ బకాయిలు చెల్లించండి'



వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్ల సంఘ సభ్యులు

అనకాపల్లిటౌన్ : పెన్షనర్ల సంఘం నేతలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ట్రెజరీ అధికారి సుభాషిణిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో భాగంగా 2018 జూలై 1 నుంచి బకాయిపడిన డీఏను సత్వరం ఇప్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపు కోసం ఊరూరా ప్రచారం



పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



న్యాయవాదులను ఓటు అభ్యర్థిస్తున్న బాజీ



కస్పావీధిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనకాపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం పార్టీ నాయకులు ప్రచార జోరు పెంచారు. గురువారం అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు మండలంలోని మాకవరం, మామిడిపాలెం, పిసినికాడ, బీఆర్టీ కాలనీ, సత్యనారాయణపురం, సంపతిపురం, వేటజంగాలపాలెం, సుందరయ్యపేట, అచ్చియ్యపేట, కుంచంగి, రొంగలివానిపాలెం, కూండ్రం గ్రామాల పరిధిలో ఉన్న సచివాలయాలు, పాఠశాలల్లో పనిచేస్తున్న పట్టభద్రులైన ఉద్యోగులను కలిశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గడచిన మూడున్నరేళ్లలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని కార్యక్రమాలను గుర్తించి పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఓటర్ల నుంచి మంచి స్పందన లభించిందని, సీఎం జగన్ అమలు చేస్తున్న విప్లవాత్మకమైన పాలనే సుధాకర్‌ను సులభంగా విజయతీరాలకు చేరుస్తుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి గురువారం ప్రచారం నిర్వహించారు. న్యాయ సముదాయంలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంకు, పోస్టాఫీసు, ఇండియన్ బ్యాంకు ఉద్యోగులను, పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని తమ మొదటి ప్రాధాన్యత ఓటు సీతంరాజుకు వేయాల్సిందిగా పార్టీ శ్రేణులతో కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి, ఎమ్మెల్సీని గెలిపించడం ద్వారా మద్దతివ్వాలని కోరారు. సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందన్నారు.



తాళ్లపాలెంలోని ప్రైవేటు స్కూల్‌లో లగిశెట్టి గణేష్ ప్రచారం

కశింకోట : వైఎస్సార్ సీపీ మద్దతు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక పార్టీ నాయకులు గురువారం కస్పావీధిలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పండూరి ఎరుకునాయుడు, నడిపల్లి నాయుడు, పార్టీ సచివాలయ కన్వీనర్లు మారిశెట్టి శ్రీనివాసరావు, గనిరెడ్డి శేషు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెంలో గాయత్రి, భార్గవి స్కూళ్లలో ఉపాధ్యాయులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.